ప్రజాశక్తి
సోమవారం 2 జనవరి 2023
5
శ్రీకాకుళం

78933 00311
రేపు డయల్ యువర్ జెసి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు డయల్ యువర్ జెసి కార్యక్రమాన్ని ఈనెల మూడో తేదీన నిర్వహిస్తున్నట్లు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం తొమ్మిది నుంచి పది గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఫిర్యాదులు, సమస్యలు తెలియజేసే రైతులు 78933 00311 మొబైల్ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను తక్షణమే పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే వారం నుంచి ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఉదయం తొమ్మిది నుంచి పది గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖజానాకు కొత్త సంవత్సర కిక్కు

- డిసెంబరు 31న రూ.5.40 కోట్ల మందు తాగేశారు
- జనవరి 1న రూ.4.12 కోట్ల అమ్మకాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ ఖజానాకు కొత్త సంవత్సరం కిక్కు ఇచ్చింది. నూతన సంవత్సర వేడుకల్లో మద్యం పరవళ్లు తొక్కింది. మందుబాబులను తాగించాలన్న ప్రభుత్వం లక్ష్యం నెరవేరింది. డిసెంబరు 31న ఒక్కరోజే రికార్డు స్థాయి అమ్మకాలతో భారీగా ఆదాయం సమకూర్చుకుంది. ఈనెల ఒకటో తేదీన రూ.4.12 కోట్ల అమ్మకాలు సాగాయి. ప్రభుత్వం ఇచ్చిన దశల వారీ మద్య నిషేధం హామీ మాత్రం అటకెక్కింది.

జిల్లాలో మొత్తం 186 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటితో పాటు 26 బార్‌లు, మూడు హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా రోజుకు సగటున రూ.నాలుగు కోట్ల మద్యం వ్యాపారం సాగుతోంది. ఈలెక్కన నెలకు రూ.వంద కోట్ల నుంచి రూ.145 కోట్ల వరకు వ్యాపారం సాగుతోంది. ఏడాది పొడవున సాగే వ్యాపారానికి డిసెంబరు చివరి రోజు, జనవరి మొదటి రోజున సాగే అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. గతేడాది డిసెంబర్ 31న ఒక్క రోజే రూ.5.10 కోట్లు అమ్మకాలు కాగా, ఈ ఏడాది డిసెంబరు 30న రూ.4.86 కోట్లు, 31న రూ.5.40 కోట్లు అమ్మకాల ద్వారా లభించింది. జనవరి ఒకటో తేదీ ఆదివారం కావడంతో రూ.4.07 కోట్లు మందుబాబులు తాగేశారు. ఈ మూడు రోజుల మద్యం వ్యాపారంలో బీర్లదే అగ్రస్థానం. ప్రతి రోజూ రాత్రి తొమ్మిది గంటలకే మద్యం దుకాణాలు మూతపడేవి. డిసెంబర్ 31న రాత్రి 12 గంటల వరకు అమ్మకాలకు ప్రభుత్వం అనుమతించింది. దీంతో శనివారం రాత్రంతా కావాల్సినంత మద్యం అందుబాటులో ఉండడంతో మద్యం ప్రియులు ఎగబడ్డారు. దీంతో యువత పెద్దఎత్తున మందేసి చిందేశారు. మద్యం అమ్మకాల సమయం పెంచడంతో విక్రయాలు పెరగడంతో ప్రభుత్వానికి మద్యం ద్వారా భారీగా ఆదాయం సమకూరింది.

కొత్త సంవత్సర కోలాహలం

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఆనందోత్సాహాల నడుమ కోలాహలంగా సాగాయి. కోవిడ్ కారణంగా రెండేళ్లు ఆంక్షల నడుమ నిరాడంబరంగా సాగగా, ఈ ఏడాది కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ గతేడాది తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఇతర ప్రజాప్రతినిధులను కలిసేందుకు వారి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ బారులు తీరారు. కలెక్టర్, ఎస్‌పి, జాయింట్ కలెక్టర్‌ను కలిసేందుకు అధికారులు, పలు శాఖల సిబ్బంది రాకపోకలతో వారి బంగ్లాల వద్ద సందడి నెలకొంది.

శనివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత శ్రీకాకుళం నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా యువత కేరింతలు కొడుతూ బాణాసంచా కాల్చి, ఆటపాటలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. కొన్ని కాలనీలు, అపార్ట్‌మెంట్లలో డిజిటల్ సౌండ్ సిస్టమ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహంగా గడిపారు. ఆదివారం ఉదయం నుంచి అధికారులు, సిబ్బంది, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల హడావుడి మొదలైంది. అన్ని స్థాయిల వారూ తమపై అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యాలయాల వద్ద కోలాహలం

ఆమదాలవలసలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, శ్రీకాకుళం నగరంలోని పెద్దపాడులో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కాశీబుగ్గలో మంత్రి సీదిరి అప్పలరాజు, కవిటిలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ కార్యాలయాలకు పెద్దసంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు బారులు తీరారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇతర ఉన్నతాధికారులు, ఎన్‌జిఒ నాయకులు స్పీకర్, మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు ఇతర అధికారులు, అనధికారులు, నాయకులు, కార్యకర్తలు వీరికి శుభాకాంక్షలు తెలియజేసేందుకు తరలివచ్చారు. వందలాది మంది తరలిరావడంతో గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. వచ్చిన వారందరికీ స్పీకర్, మంత్రులు, జెడ్‌పి చైర్‌పర్సన్ కరచాలనం చేసి శుభాకాంక్షలు తెలిపారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును కలిసేందుకు జనాలు తరలివచ్చారు. జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో కోలాహలంగా మారాయి.

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలుసుకునేందుకు జిల్లా అధికారులు, అనధికారులు తరలివచ్చారు. ఉదయం పది గంటల నుంచే అతిథులతో కలెక్టర్ బంగ్లా కళకళలాడింది. ఏటా మాదిరిగానే కలెక్టర్‌ను ఎన్‌జిఒలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జెసి ఎం.నవీన్ కేకు కట్ చేశారు. ఆయనకు జిల్లా ఉన్నతాధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, అనధికారులు ఆమెను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కేకు కట్ చేస్తున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

అప్పలరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

పింఛన్ కానుక పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పెంచిన వైఎస్‌ఆర్ పింఛను కానుక పోస్టర్, ముఖ్యమంత్రి సందేశం కరపత్రాలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల నుంచి పింఛన్‌ను రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, పరిపాలనా అధికారి దొర తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

నేటి నుంచి ఎస్ఎ-1 పరీక్షలు

ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లో గణితం పరీక్ష

ప్రజాశక్తి - టెక్కలి

విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఎస్ఎ-1 పరీక్షలు ఈనెల రెండో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మండల విద్యాశాఖ కార్యాలయాలకు పరీక్షల విభాగం నుంచి ప్రశ్నాపత్రాలు చేరాయి. రోజుకు ఒక పరీక్ష నిర్వహించనుండగా, పరీక్షకు 3 గంటల 15 నిమిషాలు సమయం కేటాయించారు. ఈ సమయంలో మెదటి పావుగంట ప్రశ్నాపత్రం చదివేందుకు సమయం కేటాయించగా, మిగిలిన మూడు గంటల్లో విద్యార్థి జవాబు పత్రాన్ని రాయాలి. పదో తరగతి పరీక్షల విధానంలో తీసుకొచ్చిన మార్పులను ఈ పరీక్షల నుంచే అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థులకు సైన్స్ పరీక్షను ఒక్కరోజు మాత్రమే నిర్వహించనున్నారు. గడిచిన పరీక్షల వరకు అటు విద్యార్థులను, ఇటు ఉపాధ్యాయులను గందరగోళంలోకి నెట్టిన విద్యాశాఖాధికారులు ఈసారి అటువంటి నిర్ణయాలకు తావివ్వలేదు.

ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌ల్లోనే గణితం పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగానే గణితం పరీక్షకు చివరి రోజును కేటాయిస్తూ కాలనిర్ణయ పట్టికను విడుదల చేశారు. ఇప్పుడిప్పుడే ట్యాబ్‌ల పంపిణీ చేసిన నేపథ్యంలో వాటిపై పూర్తిస్థాయిలో ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థులకు అవగాహన రాలేదు. ఈ తరుణంలో ట్యాబ్‌లోనే రాయాలని సూచించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో అయోమయం నెలకొంది.

2వ తేదీన ఓరియంటల్ ఒరియా, సంస్కృతం, 3వ తేదీన ఒఎస్ఎస్‌సి సంస్కృతం, 4న తెలుగు, 5న హిందీ, 6న ఆంగ్లం, 7న 8వ తరగతి విద్యార్థులకు సాంఘికశాస్త్రం, మిగిలిన తరగతులకు గణితం, 9న సైన్స్, 10న 8వ తరగతి విద్యార్థులకు గణితం, మిగిలిన తరగతులకు సాంఘిక శాస్త్రం పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉదయం ఒక పూట మాత్రమే పరీక్ష నిర్వహించనున్నారు.

ఫేస్ అటెండెన్స్ నేటి నుంచే...

- తొలుత జిల్లా కేంద్రంలో ఉద్యోగులకు అమలు
- ఈనెల 16 నుంచి అందరికీ తప్పనిసరి
- ప్రభుత్వం ఉత్తర్వులు
- మండిపడుతున్న ఉద్యోగ సంఘాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగుల సమయపాలన కోసం ప్రభుత్వం ముఖ హాజరును అమల్లోకి తెచ్చింది. తప్పనిసరిగా ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్ణీత సమయాల్లో ముఖ హాజరు వేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త సంవత్సరంలో సోమవారం నుంచి జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దీన్ని అమలు చేయాలని ఆదేశించింది. ఈనెల 16వ తేదీ నుంచి ఉద్యోగులంతా తప్పనిసరిగా ముఖ హాజరు వేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇప్పటికే వైద్యారోగ్యశాఖతో పాటు ఉపాధ్యాయులకు ముఖ హాజరును అమలు చేస్తున్న ప్రభుత్వం, తాజాగా అన్ని ప్రభుత్వ శాఖలకు దీన్ని విస్తరించింది.

ఉద్యోగుల్లో ఆందోళన

జిల్లాలో 27,416 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు 18,278 మంది, కాంట్రాక్టు ఉద్యోగులు 5,026, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు 4,112 మంది ఉన్నారు. వీరంతా ఇకపై ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం (ఎఫ్ఆర్‌బిఎఎస్) విధానంలో యాప్‌లో ముఖ హాజరు వేయాల్సి ఉంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వం ఉద్యోగులను వేధింపులకు గురిచేసేందుకే ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తుంటారు. అలాంటి వారు ప్రభుత్వం నిర్ణయించిన సమయాల్లో ముఖ హాజరు వేయడం ఎలా సాధ్యమని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.



ప్రణాళికాబద్ధంగా అరసవల్లి అభివృద్ధి

- దాతల సహకారంతో వసతుల కల్పన
- యాత్రికులకు నిత్యాన్నదాన పథకం
- టూరిజం నిధులతో కాటేజీల నిర్మాణం
- ఇంద్ర పుష్కరణి అభివృద్ధికి చర్యలు
- ఆలయ ఇఒ వి.హరి సూర్య ప్రకాష్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



దేశంలోని ప్రముఖ సూర్య దేవాలయాల్లో ఒక్కటైన అరసవల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో యాత్రికులు తరలివస్తుంటారు. ఏటా సందర్శకుల తాకిడి ఆలయానికి రెట్టింపు అవుతోంది. వారికి మెరుగైన వసతులు సమకూర్చడానికి దేవాదాయశాఖ, దాతల సహకారంతో చర్యలు చేపడుతున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వీరవల్లి హరి సూర్యప్రకాష్ తెలిపారు. అందులో భాగంగా ప్రస్తుతం అరసవల్లి ఆలయంలో తీసుకొస్తున్న మార్పులు, యాత్రికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఇంద్ర పుష్కరణి అభివృద్ధి, కాటేజీల నిర్మాణం తదితర విషయాలను ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఉత్తరాంధ్రలో సింహాచలం దేవస్థానం తర్వాత అధిక ఆదాయ వనరులు ఉండే ఆలయం అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి దేవాలయం. సింహాచలం దేవస్థానం కొండపై ఉండటం వల్ల అక్కడ ప్రత్యేకంగా వసతులు సమకూర్చుకునే వీలుంటుంది. ఆలయానికి ఉన్న స్థిరాస్తులు ఎక్కువ. కానీ ఆదిత్య ఆలయానికి అంతటి స్థిరాస్తులు లేవు. ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకుంటూ దాతల నుంచి విరాళాలు సేకరించుకుని అనేక రకాలైన వసతులను సమకూర్చుకుంటున్నాం. ఆలయంలో మౌలికవసతులతో పాటు స్వామి అలంకరణకు అవసరమైన వనరులను సమకూర్చు కోవడం జరిగింది. స్వామివారి బంగారు ఆభరణాలతో అలంకరణకు ఇప్పుడు అన్ని రకాలైన వస్తువులు ఉన్నాయి. వాటి సంరక్షణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అలంకరణ సమయంలో తప్ప మిగిలిన రోజుల్లో ఆలయానికి సంబంధించిన లాకర్లు, బ్యాంకు లాకర్లలో వీటిని భద్రపర్చడం జరుగుతోంది.

ఆదాయ వనరులు సమీకరణ, వాటి వినియోగంపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఆలయానికి ప్రధానంగా వంశపారంపర్య ధర్మకర్త పర్యవేక్షణ, అనువంశిక అర్చకుల తోడ్పాటు జిల్లా ఉన్నతాధికారులు, దేవాదాయశాఖ పర్యవేక్షణతో ఆలయ అభివృద్ధి కొనసాగుతోంది. కోవిడ్ కారణంగా మూడేళ్లుగా కొన్ని అడ్డంకులు ఎదురైనా గత రథసప్తమి తర్వాత నిరంతరాయంగా సందర్శకులకు ఆలయ ప్రవేశం కల్పిస్తున్నాం. గత ఏడాదిలో సుమారు 40లక్షల మంది యాత్రికులు సందర్శించినట్లు గుర్తించాం. ఈ ఏడాది ఆ సంఖ్య ఘననీయంగా పెరుగుతోంది. గత ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 46 లక్షల మంది యాత్రికులు ఆలయాన్ని సందర్శించారు. స్వామివారి రథసప్తమి వేడుకల్లో సుమారు లక్ష మంది వరకు రెండు రోజుల్లో ఆలయాన్ని సందర్శిస్తున్నారని అంచనా. ఈ ఏడాది ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. దీనికి తోడు కార్తీకమాసం, మార్గశిర మాసాల్లో వచ్చే ఆదివారాల్లో ఇదే స్థాయిలో సందర్శకులు హాజరవుతున్నారు. యాత్రికుల సంఖ్య పెగడం వల్ల ఆలయానికి ఆదాయ వనరులు కూడా భారీగానే పెరిగాయి. దాతలు పెత్త ఎత్తున విరాళాలు ఇస్తున్నారు. నిధుల సమీకరణ వల్ల అభివృద్ధి చేసుకునేందుకు వీలవుతుంది. ఇలా దాతలు ఇచ్చిన విరాళాలతోనే స్వామికి బంగారు మకరతోరణం, స్వర్ణకవచం, శంకు చక్రాలు, పాదపద్మాలు, భుజస్కందాలు, ఉషా ఛాయ పద్మినీ సమేతుడైన మూల విరాట్‌కు బంగారు ఆభరణాలను సమకూర్చుకోగలిగాం.

ఆలయ ప్రాంగణంలో నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి?

ఆలయానికి ప్రధానంగా నిత్యాన్నదాన కార్యక్రమానికి హాల్, వంట గది, ప్రసాదాల తయారీ కేంద్రం, తలనీలాలు సమీకరించుకునే గదులు, వసతిగృహ సముదాయం, కళ్యాణ మండపం, కాటేజీల నిర్మాణం, ఇంద్ర పుష్కరణి అభివృద్ధి వంటి పనులు జరగాల్సి ఉంది. వాటిలో ప్రధానంగా ఇంద్ర పుష్కరణి అభివృద్ధికి దేవాదాయశాఖ ఉన్నతాధికారుల అనుమతితో పనులు చేపట్టేందుకు చర్యలు మొదలు పెట్టాం. ఆర్థికంగా ఆలయ నిధుల నుంచి కేటాయించేందుకు అంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసేందుకు వీలు లేకపోవడం వల్ల దాతల నుంచి సహకారం కోరాం. అనేక మంది స్వచ్ఛందంగా వచ్చి నిధులు ఇస్తున్నారు. ఆ నిధులతో ఇంద్రపుష్కరణి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంది.

ఆలయ ఆదాయం పెంచేందుకు ఏం చర్యలు తీసుకున్నారు?

పెరుగుతున్న రద్దీకి తగ్గట్టు ఆలయ ప్రవేశానికి టిక్కెట్లు నిర్ణయించడం జరిగింది. సాధారణ రోజుల్లో కాకుండా ప్రత్యేక రోజుల్లో టిక్కెట్ల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతోంది. గతంలో అంతరాలయ ప్రవేశానికి కొందరికి మాత్రమే అనుమతించడం జరిగేది. కానీ ఇప్పుడు ప్రత్యేక సందర్శకుల నుంచి రూ.500 టిక్కెట్లు వసూలు చేయడం జరుగుతోంది. వారికి అంతరాలయ సందర్శనకు అనుమతించడం జరుగుతుంది. మిగిలిన రూ.100 టిక్కెట్లకు, ఉచిత ప్రవేశానికి ప్రత్యేక క్యూలైన్లు ద్వారా ఆలయ ప్రవేశం కల్పించడం జరుగుతుంది. మాస శివరాత్రి రోజుల్లో క్షీరాభిషేకంతో పాటు ఏకాదశి రోజుల్లో స్వామి కళ్యాణం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు టిక్కెట్లు కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. అరసవల్లిలో సూర్య నమస్కారాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ కార్యక్రమానికి దేవాదాయశాఖ నిర్దేశించిన మేరకు టిక్కెట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఆదాయ వనరుల సమీకరణకు ఇవి దోహదపడుతున్నాయి.

దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు రాత్రిబస చేసేందుకు దేవస్థానం పరిధిలో కాటేజీలు తక్కువ సంఖ్యలోనే అందుబాటులో ఉన్నాయి. వాటి వినియోగం కష్ట సాధ్యమవుతోంది. అందువల్ల ఎక్కువ మంది విశాఖలో, శ్రీకాకుళం నగరంలోని ప్రైవేటు హోటళ్లలో బసచేసి ఉదయం ఆలయాన్ని సందర్శిస్తున్నారు. వారికి వసతి సౌకర్యం కల్పించాలన్న ప్రయత్నంలో భాగంగా ఆలయానికి ఎదురుగా ఉన్న ఇంద్ర పుష్కరణి వద్ద కాటేజీలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పర్యాటక శాఖ సహకారంతో వీటిని నిర్మించేందుకు రూపకల్పన జరుగుతోంది. ఉన్నత స్థాయిలో ఇప్పటికే ఈ అంశంపై చర్చలు జరిగాయి. వివిధ దశల్లో అనుమతులు మంజూరు కావాల్సి ఉంది. వీటితో పాటు దాతల సహకారంతో నిర్మించే ఆలోచన కూడా ఉంది. ఆ దిశగా ఆలోచన చేస్తున్నాం. ఆలయంలో యాత్రికుల అవసరాలకు తగ్గట్టుగా మౌలికవసతులను కల్పించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం మండలం మునసబుపేటకు చెందిన 36 మంది లబ్ధిదారులకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఇళ్ల పట్టాలను అందజేశారు. పెద్దపాడులోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరిస్తూ, అధికార యంత్రాంగ సమన్వయంతో సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి నిర్మల, తహశీల్దార్ ఎన్.వెంకటరావు, వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావు, రంధి రాజారావు పాల్గొన్నారు.

పట్టాను అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

మాల్దీవుల్లో చిక్కుకున్న సిక్కోలు యువకులు

మాల్దీవుల్లో చిక్కుకున్న సిక్కోలువాసులు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఉపాధి నిమిత్తం మాల్దీవులకు వెళ్లిన సిక్కోలు, ఒడిశాకు చెందిన 32 మంది అక్కడ చిక్కుకున్నామని, తమను కాపాడాలని ఇచ్ఛాపురంలోని రత్తకన్నకు చెందిన పైల పరుశురాం వాపోయాడు. మాల్‌దీవుల నుంచి కుటుంబ సభ్యులకు శనివారం ఫోన్ చేశారు. పొటోలను పంపించాడు. తాము మోసపోయామని, తమను స్వస్థలాలకు రప్పించాలని కోరాడు.

ఇచ్ఛాపురంలోని రత్తకన్న గ్రామానికి చెందిన ఇద్దరు సబ్ ఏజెంట్లు, పూండీకి చెందిన పి.శివ, మురళీరెడ్డి ద్వారా విశాఖ పూర్ణ మార్కెట్ ప్రాంతంలో పండా వీధిలో భావన ఇనిస్టిట్యూట్ ద్వారా వీరంతా మాల్దీవులకు ఈ ఏడాది ఏప్రిల్‌లో వెళ్లారు. మంచి జీతం, మంచి పని అని చెప్పి దళారులు వేలకు వేలు దండుకుని అక్కడికి పంపించారు. తీరా అక్కడ నాలుగు నెలలు జీతాలు ఇచ్చి మిగిలిన నెలలకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారు. కనీసం తమ పాస్‌పోర్ట్‌లు ఇస్తే వెళ్లిపోతాం అన్నా విడిచి పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఇచ్ఛాపురంలోని సబ్ ఏజెంట్లకి చెప్పినా స్పందించడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. మాల్దీవులకు శ్రీకాకుళం నుంచి 25 మంది, పశ్చిమగోదావరికి చెందిన ఇద్దరు, ఒడిశా నుంచి ఐదుగురు వెళ్లారు. రత్తకన్నకుచెందిన పైల పరుశురాం రాక కోసం ఆయన తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని వారిని సొంత జిల్లాకు రప్పించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

శ్రీకాకుళం : డిఐజి రామకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌పి రాధిక

టెక్కలి: సబ్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

ఆమదాలవలస : జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయలక్ష్మి

టెక్కలి రూరల్ : దువ్వాడకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు : శ్రావణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

శ్రీకాకుళం : విశాఖ రేంజ్ కార్యాలయంలో డిఐజి ఎస్.హరికృష్ణను ఎస్‌పి జి.ఆర్.రాధిక మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అనకాపల్లి ఎస్‌పి గౌతమ్‌శాలి, 5వ బెటాలియన్ కమాండెంట్, విజయనగరం ఎస్‌పిలు విక్రాంత్ పాటిల్, దీపికాపాటిల్‌ను కలిసి కూడా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్ : అరవసల్లిలోని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, సుధాకర్, జామి భీమశంకర్, కృష్ణమూర్తినాయుడు పాల్గొని ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలంలోని హనుమంతనాయుడుపేటలోని వైసిపి కార్యాలయంలో జెడ్‌పిటిసి వసంతరెడ్డి, నౌపడ టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు కేక్‌లను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఉమాసుందరికి కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపిపి రాజేశ్వరి ఎంపిడిఒ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. దీంతో పలు కార్యాలయాల్లో సందడి నెలకొంది.

ఆమదాలవలస : డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతికి నియోజకవర్గ పరిధిలోని పలువురు కాంగ్రెస్ అభిమానులు, అధికారులు, శ్రేయోభిలాషులు పట్టణంలోని మెట్టక్కివలసలో ఉన్న ఆమె స్వగృహంలోకలిసి పుష్పగుచ్ఛాలు, మిఠాయిలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

వైసిపి నియోజకవర్గ నాయకుడు సువారి గాంధీని పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న పార్టీ కార్యాలయంలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు వచ్చి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

పట్టణంలోని మెయిన్ రోడ్‌లో ఉన్న వైసిపి కార్యాలయంలో కోట గోవిందరావును నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

వైసిపి నాయకులు మూడు గ్రూపులుగా ఏర్పడి ఎవరికి వారు కార్యక్రమాలను చేపట్టడంపై నాయకులు, ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. చాలామంది ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఎవరిని కలవకుండా ఈ వేడుకలకు దూరంగా ఉండిపోయారు.

జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్.మణికు కోర్టు హాల్లో అధికారులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సిఐ పైడయ్య, ఎస్‌ఐలు కృష్ణ, అశోక్, కృష్ణప్రసాద్, న్యాయవాదులు బొడ్డేపల్లి మోహనరావు, సీపాన గోవిందరావు, బూర్లె సీతారాం, వరహానరసింహం, హనుమంతు ప్రసాద్‌లు జడ్జికి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జి.సిగడాం : మండలంలోని ఎస్.ఆర్.పురంలో మాజీ ఎమ్మెల్యే నీలకంఠంనాయుడు, నడిమివలసలో ఎంపిపి మీసాల సత్యవతి, కొత్తపేటలో జెడ్‌పిటిసి కాయల రమణలను అధికారులు, వైసిపి నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు మీసాల వెంకటరమణ, ఎంఇఒ రవి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కొత్తూరు : మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ స్వగ్రామం మాతలలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని టిడిపి నాయకులు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావుకు అభిమానులు, వైసిపి నాయకులు కలిసి పుష్పగచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పాతపట్నం : పారిశ్రామికవేత్త సిరిపురం తేజేశ్వరరావుకు పాతపట్నంలోని తన నివాసంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, ఎల్ఎన్‌పేట, కొత్తూరు మండలాల నుంచి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, మహిళలు పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

సామాజిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు తన ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని అభిమానులు స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పొందూరు : ఆమదాలవలసలోని టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌ను మండలంలోని నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కోటబొమ్మాళి: ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులకు వైసిపి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్‌కు మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కవిటి : వైసిపి నాయకుడు నర్తు రామారావు, జనసేన నాయకుడు లోళ్ల రాజేష్, ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ తదితరులకు అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

పలాస: పలాస టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి గౌతు శివాజీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు అభిమానులు తరలివచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, పి.విఠల్‌రావు, వజ్జ గంగా భవాని, మాజీ ఎంపిపి దువ్వాడ కృష్ణమూర్తినాయుడు, టంకాల రవిశంకర్ గుప్తా, బూరెల విజయ్, బి.నాగరాజు, మల్లా శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలాస మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు, కౌన్సిలర్‌లు, అధికారులు, అభిమానులు తరలివచ్చారు.

మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ సంఘాల నాయకులు, అభిమానులు తరలివచ్చారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు.

టెక్కలి రూరల్ : ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తన కార్యాలయంలో, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి తన కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయాడానికి నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల నుండి కార్యకర్తలు, నాయకులు, అధికారులు, అనధికారులు వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

టెక్కలి: సబ్ కలక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని తహశీల్దార్ బెండి గిరిబాబు, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నర్సింగపల్లి, గూడెం, పాత నౌపడా, బొప్పాయిపురం, పరశురాంపురం, అక్కవరంలో సచివాలయ సిబ్బంది సర్పంచ్‌లను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

యుటిఎఫ్ నాయకులు డి.వైకుంఠరావు, పి.జగదీష్, టి.వైకుంఠరావు, పి.ధర్మారావు సబ్ కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో పి.ధర్మారావు, కె.దాలయ్య, ఎం.కుమారస్వామి, ఆర్.విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

కవిటి: ఎమ్మెల్యే అశోక్‌కు ప్రముఖులు, అధికారులు, నాయకులు, స్థానికులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి నాయకుడు నర్తు రామారావు, జనసేన నాయకుడు లోళ్ల రాజేష్, ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ తదితరులకు అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

వజ్రపుకొత్తూరు: జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ పాలిన శ్రావణి తన నివాసంలో, ఎంపిపి ఉప్పరపల్లి నేలవేణి ఉదయ్‌కుమార్ స్వగృహంలో మండల అధికారుల సమక్షంలో కేక్ కట్ చేసి, మిఠాయిలను అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమాల్లో పాలిన శ్రీనివాసరావు, వైసిపి మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు పాలిన ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ సిహెచ్ ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఎమ్మెల్యే రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ మామిడి శ్రీకాంత్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మామిడి గోవిందరావు, సిరిపురం తేజేశ్వరరావు, ఎంపిపి రాణా ఈశ్వరమ్మ, ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి జి.ఎండయ్య, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ చంద్రకుమారి, ఎస్‌ఐ రాజేష్, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, పిఎసిఎస్ అధ్యక్షులు యు.బాలరాజుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కవిటి : చిన్నారితో కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే అశోక్

శ్రీకాకుళం అర్బన్ : కేక్‌ను కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

పలాస : గౌతు శిరీషకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పొందూరు : రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జి.సిగడాం : మాజీ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

ఆమదాలవలస : గాంధీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అభిమానులు

పాతపట్నం : కేక్‌ను కట్ చేస్తున్న తేజేశ్వరరావు

పాతపట్నం : ఎంజిఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

రంగవల్లుల పోటీలు

విజేతలతో నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజావేదిక ఆధ్వర్యాన నగరంలోని తుమ్మావీధిలో ఉన్న నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో రంగవల్లిక పోటీలను ఆదివారం నిర్వహించారు. తుమ్మావీధి, బర్మా కాలనీ ప్రాంత వాసులు పాల్గొన్నారు. శనివారం రాత్రి ఇంటి ముందు పోటాపోటీగా వేసిన ముగ్గులను ప్రజావేదిక న్యాయ నిర్ణేతలు ఆదివారం ఉదయం ఇంటింటికీ వెళ్లి వాటిలో అందమైన ముగ్గులను గుర్తించారు. మహిళా సంఘం నాయకులు లక్ష్మి, నాగమణి ముగ్గులను పర్యవేక్షించారు. రూపకుమారి, సూర్యకుమారి, దుర్గామహాలక్ష్మి, సుజాత, బాలామణి, సోమకుమారి తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వి.జి.కె.మూర్తి, ప్రభాకరరావు, శ్రీనివాసు, సుధాకరరావులు సహకారాన్ని అందజేశారు. ఈ పోటీలో శ్రీదేవి, పూజ, కోమరదేవి, మధు, లీలామాధురిలు విజేతలుగా నిలిచారు. నగరంలో వాణిజ్య వేత్త చంద్రమౌళి బ్రదర్స్ విజేతలకు బహుమతులను అందజేశారు.

రామారావు ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి - పలాస

పనిపై నిబద్ధత, పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం కలిగిన వ్యక్తి రామారావు అని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం నాయకులు బి.ఆనందరావు అన్నారు. కాశీబుగ్గ సిఐటియు కార్యాలయంలో రామారావు ఆరో వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. తొలుత రామారావు చిత్రపటానికి ఆయన భార్య భాగ్యలక్ష్మి, నాయకులు పూలమాల వేసి, నివాళ్లర్పించారు. అనంతరం బి.ఓంకార్ అధ్యక్షతన జరిగిన సభలో ఆనందరావు మాట్లాడుతూ రామారావు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐలో కీలకపాత్ర పోషించారని అన్నారు. ప్రజాశక్తి అభివృద్ధిలో

రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తనవంతు పాత్ర పోషించారని చెప్పారు. ఐద్వా నాయకురాలు బి.సుగుణవతి మాట్లాడుతూ అంకితభావం, క్రమశిక్షణ, సమయపాలన ఆయన నుంచి నేర్చుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో భాస్కరరావు, తిరుమలరావు, నారాయణరావు, టి.అజయ్‌కుమార్, నాని, ఎన్.మోహనరావు, బి.సరస్వతి, గన్నయ్య, సరోజనమ్మ, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఇంటిపై దాడి కేసు నమోదు

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మి ఇంటిపై దాడి సంఘటనలో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. దళితకు చెందిన తనపై అక్కసుతో వేధింపులకు గురిచేయడమే కాకుండా, తన ఇంటిపై దాడికి పాల్పడ్డారని ఇటీవల ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై జుడీషియల్ మెజిస్ట్రేట్ సూచనల మేరకు స్థానిక వైసిపి నేతలు గడ్ల మోహనరావు, జరజాపు వెంకటరావు, కొన్న సత్తిబాబు, కంట గోవింద, దోరడ్ల గన్నబాబులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం

పాల్గొన్న కవులు

శ్రీకాకుళం అర్బన్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యాన నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో 76వ నెల సాహితీ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 16 మంది కవులు పాల్గొని తమ కవితలు వినిపించారు. డాక్టర్ బారువ కోమలరావు (తరువులు), తోట గోపాలరావు (డ్రగ్స్), ముట్నూరు ఉపేంద్రశర్మ (శుభాకాంక్షలు), ఆర్.వి.రమణమూర్తి (సంక్రాంతి సంబరాలు), ఐ.ఎన్.డి.ప్రసాద్ (ఎవరు గొప్ప?), ఇద్దిపాపయ్య (కృషి చేస్తే విజయం), తంగి ఎర్రమ్మ (కవివర్యుల్లారా!), పి.వి.దుర్గాప్రసాద్ (ఆశ.. శ్వాస), ఎం.రామకృష్ణ (నిజం పెరుమాళ్ల కే ఎరుక), యు.నాగేశ్వరరావు (రోగ నిరోధక శక్తి), భోగెల ఉమామహేశ్వరరావు (తెల్సుకో ఓటరన్నా), గుడిమెట్ల గోపాలకృష్ణ (నా వాళ్లలో నేను), సోడవరం ఈశ్వరరావు (పద పద లక్ష్యం దిశగా), మంగిపూడి శ్రీనివాసరావు (ఆశీర్వచనం), కె.బి.రవికిరణ్ (పోలిక), కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో సాహితీ వేత్త జంధ్యాల శరత్‌బాబు, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తిలు పాల్గొన్నారు.

ఖాతాల్లో నగదు మాయం

- లబోదిబోమంటున్న బాధితులు
- తమ చేతుల్లో లేదంటున్న బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని పలు బ్యాంకుల్లో ఖాతాదారుల అకౌంట్ల నుంచి నగదు పోతోంది. మండలంలోని ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన బదకల ఈశ్వరరావు, పిరియా సుధాకర్, భైరిపురం గ్రామానికి చెందిన పుల్లటి ఆదిలక్ష్మి, బెలగాం గ్రామానికి చెందిన రంగా రౌలో, కేసుపురం గ్రామానికి చెందిన కె.ఉమాపతి తమ నగదు పోయినట్టు తెలిపారు. మండలంలోని కవిటి, శిలగాం గ్రామాల్లో ఉన్న ఎస్‌బిఐ, రాజపురం గ్రామంలోని యూనియన్ బ్యాంకు ఖాతాదారులు తమ డబ్బులు పోయినట్టు తెలిపారు. ఇప్పటికే దీనిపై బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశామని వారు చెబుతున్నారు. బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇటీవల ఎక్కడైనా వేలిముద్రలు వేశారా అని, తెలియని వారు పంపించే సందేశాలకు సమాధానం ఇచ్చారా అని అడుగుతున్నారని, కానీ వేలిముద్ర వేయనిదే పూటగడవని పరిస్థితిని ప్రభుత్వాలే ఏర్పరిచాయని బాధితులు వాపోతున్నారు. అంతేకాకుండా ఎప్పటి నుంచో



నగదు పోయినట్టు వచ్చిన సందేశం

తనలాగే చాలామంది డబ్బులు పోతున్నా అటు ప్రభుత్వాలు కానీ ఇటు ఆర్‌బిఐ కానీ ఎటువంటి పటిష్ట చర్యలు తీసుకోకపోవడంతో వీరు బ్యాంకులను నమ్మని పరిస్థితి నెలకొంది. ఇకపై బ్యాంకులో డబ్బులు దాచుకోవడం అంటేనే భయంగా ఉందని వారు అంటున్నారు.

పిల్లల చదువు కోసం దాచుకున్నా

పిల్లల చదువు కోసం రూపాయి రూపాయి కూడబెట్టి కవిటి ఎస్‌బిఐలో రూ.27వేలు దాచుకున్నా. నవంబరులో నా ఖాతా నుంచి రూ.5వేలు తీసినట్టు ఫోన్‌కి మెసెజ్ వచ్చింది. కానీ ఆ డబ్బులు నేను తీయలేదు. అలాగే తెలియని వారి సందేశాలకు స్పందించలేదు. కానీ డబ్బులు పోయాయి. మళ్లీ డిసెంబర్ 26, 27తేదీలో వరుసగా రూ.10వేలు చొప్పున పోయాయి. మొత్తం నా ఖాతా నుంచి రూ.25వేలు పోయాయి. బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశాను. బ్యాంకులో డబ్బులు దాచుకోవడం అంటేనే భయంగా ఉంది. భవిష్యత్‌లో ఏదో భరోసా ఇస్తేకానీ బ్యాంకులో డబ్బులు వేయకూడదు అనుకుంటున్నా.

- బదకల ఈశ్వరరావు, ప్రగడపుట్టుగ

ఉన్నతాధికారులకు తెలియజేశాం

తమ ఖాతాల నుంచి నగదు పోయినట్టు మా ఖాతాదారులు కొంతమంది ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు మా ఉన్నతాధికారులకు తెలియజేశాం. గతంలో కూడా కొంతమంది మా ఖాతాదారుల నగదు పోయింది. అది మళ్లీ నెల రోజుల్లో వారి ఖాతాలోకి జమ చేయడం జరిగింది. ఇప్పుడు కూడా బాధితులకు త్వరలోనే ఖాతాల్లో నగదు జమవుతుంది.

- ఎల్.మిశ్రా, యూనియన్ బ్యాంకు మేనేజర్, రాజపురం

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న జగన్నాయకులు

ప్రజాశక్తి - పలాస

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచి పనులు చేస్తూ ఈ ఏడాదంతా ముందుకు సాగాలని పాత్రియ చర్చి పాస్టర్ సవర జగన్నాయకులు అన్నారు. మండలంలోని పాత్రియ గ్రామంలో ఆదివారం క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్గాన్ని ఎంచుకొని సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం గిరిజన బాలికలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సవర మోహనరావు, సవర రామారావు, ఎఎంసి మెంబర్ సవర కృపావతి, ఆల్ ఇండియా ఆదివాసీ ఉద్యోగుల సంఘం పలాస ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సవర కేశవరావు, సవర సురేష్, సవర కిరణ్, సవర సంజీవ్, సవర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల మహిళా అధ్యక్షులుగా మానస

మానస

రణస్థలం రూరల్ : మండలంలోని వల్లభరావుపేటకు చెందిన గురాన మానసను వైసిపి మండల మహిళా అధ్యక్షులుగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ ఈ పదవిలో మరింత బాధ్యత పెరిగిందన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మానసకు వైసిపి నాయకులు గురాన చిరంజీవి, పాలూరి బుజ్జి, మహంతి సత్యనారాయణ, గడి రమణ, బంగారునాయుడు, రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

కేలండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమాజాభివృద్ధి అవరోధంగా ఉన్న మూఢనమ్మకాలను, అశాస్త్రీయ భావనల ప్రచారాన్ని వ్యతిరేకించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొంటి గిరిధర్, కుప్పిలి కామేశ్వరావులు పిలుపునిచ్చారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు చట్టాలు చేయాలని కోరారు. ఆదివారం జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో నూతన సంవత్సర కేలండర్లు, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జెవివి గౌరవ అధ్యక్షులు కొత్తకోట అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షులు పి.కూర్మారావు, ఐ.జగన్మోహనరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, కాగాన ముకుందరావు, లక్ష్మణరావు, వాసుదేవరావు, పురుషోత్తం, ప్రభాకర్, రామస్వామి పాల్గొన్నారు.

ఆమదాలవలస : కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రామ్మోహనరావు

శ్రీకాకుళం అర్బన్ : కేలండర్లను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

జనసేన...

ఆమదాలవలస : పట్టణంలోని జనసేన కార్యాలయంలో పార్టీ నూతన కేలండర్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు సైనికులు ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని జనసేన కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఈనెల రెండో తేదీ నుంచి నిర్వహించే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలకు విశాఖ రైల్వేస్టేషన్ నుంచి పయనమవుతున్న జిల్లాకు చెందిన సిఐటియు ప్రతినిధులు - ప్రజాశక్తి, విశాఖపట్నం

ట్రాక్టరు మిస్సింగ్‌పై ఫిర్యాదు

పొందూరు: స్థానిక మేజర్ పంచాయతీలోని వాటర్ ట్యాంకు ట్రాక్టర్ కనిపించడం లేదని పొందూరు పంచాయతీ ఇఒ ఎస్.రమేష్ స్థానిక పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పంచాయతీలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ ట్రాక్టర్ కొంతకాలంగా కనిపించడం లేదంటూ స్థానికులు కంట గోవిందరావు, తదితరులు ఇటీవల ఇఒ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇఒ పంచాయతీ సిబ్బందితో విచారణ చేపట్టగా, ట్రాక్టర్ ఆనవాళ్లు కానరాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డాక్టర్ శ్రీనుబాబును సన్మానిస్తున్న సభ్యులు

దాతలకు 'అభయం' సన్మానం

టెక్కలి రూరల్ : అభయం యువజన సేవా సంఘం ఆరో వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పలు సేవా సంఘ ప్రతినిధులను, అభయం ఫుడ్ బ్యాంక్‌కి నిత్యం అన్నదానం చేసే దాతలకు ముఖ్య అతిథి ప్రముఖ వైద్యులు డాక్టర్ సీపాన శ్రీనుబాబు సన్మానం చేశారు. అనంతరం ఆయనను సభ్యులు సన్మానించారు. నలుగురు సేవా సంఘం స్థాపకులు సుప్రజ , సమరత సేవా సంఘం ప్రతినిధి కోరాడ రాంప్రసాద్, కోటబొమ్మాళి హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధి అప్పలరాజు, యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనువాసరావు, అట్టాడ సాయికుమార్, జి.శివారెడ్డి, లాడి కామేశ్వరరావు, దివ్వల మాధురి, ఉప్పాడ తారకేశ్వరరావు, గూన నరసింహారావు, దుక్క సంజనరెడ్డి, అభయం సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

సందడిగా క్రికెట్ పోటీలు

ప్రారంభిస్తున్న మోహనరావు

పొందూరు: పొందూరుకు చెందిన ఎన్ని జగదీష్, గోరు మోహన్‌ల జ్ఞాపకార్థం శ్రీరామనగర్ కాలనీ మైదానం లో కళామందిర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం తండ్యాం ఎంపిటిసి ప్రతినిధి వడగా మోహ నరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 45 జట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో దల్లవలస జట్టుపై నరసాపురం జట్టు, పొందూరు లావేటిలైన్స్ జట్టుపై సిరిపురం జట్టు, గుర్రాలపాలెం జట్టుపై ఆర్‌సిహెచ్ అగ్రహారం జట్టు విజయం సాధించాయి. ఈ పోటీల్లో నిర్వాహక కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో 'నూతన' ఉత్సాహం

భావనపాడు తీరంలో సందర్శకులు

కవిటి, నౌపడ: నూతన సంవత్సర వేడుకలకు ఆదివారం తోడవడంతో సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ ఏకమవడంతో ఆనందోత్సవాలు వెల్లివిరిసాయి. అందరూ ఏకమై ఆడారు, పాడారు, సరదాగా సంద్రంలో తడిసారు. దీంతో ఆంగ్ల సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ, ఆనందోత్సవాల వేడుకలకు వేదికైన కవిటి మండలం పుక్కళ్లపాలెం తీరం జన 'సంద్రం'గా మారింది. సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరంలో యాత్రికుల నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం నూతన సంవత్సర వేడుకలు కలిసి రావడంతో సందర్శకులు పెద్ద ఎత్తున వచ్చి తీరంలో సందడి చేశారు. సముద్ర తీరంలో కేక్ కటింగ్ చేశారు. చిన్నాపెద్ద తేడా లేకుండా యాంత్రిక జీవనాన్ని పక్కన పెట్టి నూతన సంవత్సర వేడుకల్లో మునిగిపోయారు. మెరైన్ పోలీసులు, నౌపడ పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు.

పుక్కళ్లపాలెం తీరంలో జన సందోహం

కార్మిక హక్కుల రక్షణకు పోరాటం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

భూమికి, భుక్తికి, భానిసత్వం విముక్తికి సుదీర్ఘ పోరాటాలు చేసిన ఘన చరిత్ర సిపిఐకి ఉందని జిల్లా కార్యవర్గ సభ్యులు యడ్ల గోపి, జిల్లా సమితి సభ్యులు అనపాన షణ్ముఖరావు అన్నారు. సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని తులసిపేట దళితవాడలో ఆదివారం పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరిజన, గిరిజన, బడుగు, బలహీన వర్గాల పేద, కార్మిక, కర్షక, ఉద్యోగ, కష్ట జీవుల హక్కుల కోసం పోరాడింది సిపిఐ అని అన్నారు. పేదలకు ఇళ్ళు, దున్నేవానికి భూమి, కార్మిక, ఉద్యోగ హక్కుల సాధనకు విరోశిత పోరాటాలు చేసిన ఘనత సిపిఐది అని అన్నారు. వేలాది మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ప్రాణ త్యాగాలు ఫలితంగా పోరాడి రాజ్యాంగం ద్వారా పొందిన కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజల హక్కులను ప్రస్తుత పాలకులు హరించి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలిసికట్టుగా పోరాడి కార్మిక హక్కులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త గురవెల్లి నారాయణ, నాయకులు పాల పోలారావు, బసవల అప్పారావు, చిట్టి సింహాచలం, దేవాది రామకృష్ణ, కె.శకుంతలమ్మ, కొల్లి చామంతి, తోట చిన్నారావు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

దళితుల ఐక్యత అవసరం

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

టెక్కలి: దళితుల ఐక్యత అవసరమని, దళిత ఉద్యమాలపై అలుపెరగని పోరాటాలు చేసిన కోరెగావ్ భీమా జీవితం నుంచి మనం ఇది నేర్చుకోవాలని సమతా సైనిక్ దళ్ జిల్లా కన్వీనర్ చల్లా రమారావు అన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి, నివాళులర్పించారు. కోరెగావ్ భీమా జీవితం గురించి వివరించారు. కార్యక్రమంలో జర్జాన చంద్రశేఖర్, టి.హేమసుందర్‌రావు, ఎ.మాధవరావు, టి.సూర్యం, పేర నాగేశ్వరరావు, పాపారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలో అపారిశుద్ధ్యం

ప్రజాశక్తి- బూర్జ

గ్రామీణ ప్రాంతాల్లోని అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, వారి సమస్యలను తక్షణమే పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని అటు పాలకులు, ఇటు అధికారులు చెబుతున్న మాటలు. కానీ, అటువంటి చర్యలు తీసుకున్న దాఖలు లేవు మండల కేంద్రంలోని దళితవాడలో సమస్యలు తిష్ట వేశాయి. దశాబ్దాలు కాలంగా సమస్యల పరిష్కారానికి పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నా తను గోడును వినే నాథుడే లేరని గగ్గోలు పెడుతున్నారు. దళిత వాడిలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని, కంపు భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. నివాస ప్రాంతాల చుట్టూ చెత్తకుప్పల పేరుకుపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం అనునిత్యం అవసరపడుతున్నామన్నారు. ఒక్క కుళాయి మాత్రమే ఉండడంతో తాగునీరుకు అవస్థలు పడుతున్నామన్నారు. అలాగే దళితవాడికి సంబంధించి సరైన రహదారి లేకపోవడంతో అనునిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ముఖ్యంగా అత్యవసర సమయంలో మరుగుదొడ్లు లేకపోవడంతో తమ అవస్థలు వర్ణతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎంపిడిఒ కార్యాలయంలో ఉన్న వ్యక్తి మరుగుదొడ్లు నిర్మిస్తామని లక్షలాది రూపాయలు వసూలు చేసి వాటిని నిర్మించారని, అయితే అవి పూర్తిస్థాయిలో నిర్మించిక లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. అంతేకాకుండా ఆ స్థానం దేవాలయాలకు సంబంధించింది కావడంతో వారు ప్రవేశానికి అంగీకరించడం లేదని మహిళల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దళితుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని దళితులు కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న దళితవాడ

రక్తదానం చేస్తున్న బిజిఆర్ సభ్యులు

బిజిఆర్ సభ్యుల రక్తదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యావేత్త బరాటం గోవిందరావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు నగరంలోని న్యూ బ్లడ్ బ్యాంకులో ఆదివారం రక్తదానం చేశారు. ఈ మేరకు బిజిఆర్ ఫౌండేషన్ తరుపున 40 మంది తలసేమియా బాధితులకు న్యూట్రిషన్ డ్రై ఫ్రూట్స్ అందజేశారు. వారి విద్యకు ఫౌండేషన్ ద్వారా తోడ్పాటు అందిస్తామని ఫౌండేషన్ చైర్మన్ బరాటం శ్రీనివాసు చక్రవర్తి, మనవడు స్వాగత్ స్మార్టాట్‌లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీశ్రీ ఫౌండేషన్ చైర్మన్ శ్రీకాంత్, న్యూశ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ, వెంకటరమణ, శివప్రసాద్, ఉమాశంకర్, మర్రి నరేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

కేన్సర్ రోగికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని నీలాపుపుట్టుగకు చెందిన మజ్జి సంతోషి కొద్ది రోజులుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతల కోం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న సన్యాసిపుట్టుగ హెల్పింగ్ హేండ్స్ ఆర్గనైజేషన్ సేవా సంస్థ బాధిత రోగి కుటుంబానికి రూ.పది వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేసింది. సమస్య ఎక్కడ ఉన్నా మేము ఉన్నామని, అందరూ మనవాళ్లే అనే సేవా భావంతో స్పందిస్తున్న ఫౌండేషన్ సభ్యులకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : పింఛను అందజేస్తున్న పార్వతి

పింఛన్ల పంపిణీ

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురంలో పింఛను కానుకను సర్పంచ్ గురువెల్లి కేశవరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని చింతలపేట సచివాలయ పరిధిలోని దండేవలసలో సచివాలయ కన్వీనర్, మాజీ ఉపసర్పంచ్ సీపాన శైలజ వృద్ధులకు పింఛన్లను పంపిణీ చేశారు.

టెక్కలి రూరల్: పింఛను వారోత్సవాల్లో భాగంగా ఎంపిటిసి-2 కూన పార్వతి మేజరు పంచాయతీ జెడ్‌పి రోడ్డులో లబ్ధిదారులకు ఆదివారం పింఛన్లు పంపిణీ చేశారు. కొత్త సంవత్సరం ప్రారంభం రోజు రూ.2,750 పింఛన్‌ను లబ్ధిదారులు అందుకుంటున్నారని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో రూ. వెయ్యి ఉన్న పింఛను జగన్ సిఎంగా బాధ్యతలు చేపట్టగానే రూ.2,250కు పెంచారని, క్రమక్రమంగా 2022 జనవరిలో రూ.2,500, ఈ జనవరి నుంచి రూ. 2,750కి పెంచుకుంటూ వచ్చారని తెలిపారు.

చిన్నారులతో మాట్లాడుతున్న అప్పలనాయుడు

చిన్న వయసులో గొప్ప ఆలోచన

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలోని అద్దానంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారులు స్వయంగా గ్రీటింగ్ కార్డులు తయారు చేసి ప్రదర్శించారు. ప్రదర్శించిన గ్రీటింగ్‌లు అమ్మగా వచ్చిన డబ్బులను గ్రామంలోని అనాథ పిల్లలకు ఆర్థికసాయం అందజేశారు. విషయం తెలుసుకున్న టిడిపి సీనియర్ నాయకులు, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు చిన్నారులను కలిసి అభినందిస్తూ... నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చిన్న వయసులో అంత గొప్ప ఆలోచన రావడం, వీళ్లకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కొన్ని గ్రీటింగ్‌లను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణకుమారి, ఎ.సీతమ్మ పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ఎపిఎంగా బాబూరావు

బూర్జ : మండలంలో ఐకెపి ఎపిఎంగా పి.బాబూరావు ఆదివారం విధులకు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎపిఎం కె.రాము కోటబొమ్మాళి బదిలీపై వెళ్లాడు. బాబూరావు శ్రీకాకుళంలో పనిచేస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని అన్ని డ్వాక్రా సంఘాల సభ్యులకు వారం వారం సమావేశం నిర్వహించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తానని చెప్పారు. ఇందులో భాగంగా సిబ్బంది పుష్పగుచ్చాలతో స్వాగతం పలుకుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అధ్వానంగా కాలువలు

ఆమదాలవలస : మండలంలోని కొత్తవలసలో పారిశుధ్యం అధ్వానంగా తయారయ్యిందని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. కొన్నాళ్లుగా కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీయకపోవడంతో మురుగునీరు అప్పుడప్పుడు రోడ్డుపై నుంచి ప్రవహిస్తూ ఇబ్బందులకు గురవుతున్నామని చెబుతున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో కనీస అవసరాలైనా చేరడం లేదని ప్రజలు వాపోతున్నారు. పారిశుద్ధ్యం ఇలా ఉంటే రోగాలు రావా? అని ప్రశ్నిస్తున్నారు. నాలుగు నెలలుగా కాలువల్లోని చెత్తను తొలగించకపోవడంతో మురుగునీరు నిల్వ ఉంటుంది. దీంతో ప్రజలు డెంగీ, మలేరియా వంటి జ్వరాల బారినపడి పలు ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపైనే దర్శనమిస్తుండడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరుతున్నారు.

కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు